ప్రత్యేక పూజలు

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్‌లో శేరిలింగంపల్లి సర్వీ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రామరాజు, సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు అధ్యక్షులు మనోజ్ చౌదరి, మంగిలాల్ పరిహారియా చౌదరి, భక్తులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారీలు (చందానగర్ శాఖ), సోషల్ సర్వీస్ వింగ్ (ఆర్‌ఈఆర్‌ఎఫ్), భారతీయ రెడ్ క్రాస్ సొసైటీల సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ ప్రారంభించారు.రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు.

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటకిషన్

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటకిషన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీహరి జీహెచ్ ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు.ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్ రావు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అందంతో ఆత్మవిశ్వాసం

జబర్దస్త్ ఫేమ్ వర్ష



సెలూన్‌ను ప్రారంభిస్తున్న నటి వర్ష

గచ్చిబౌలి: అందం ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందని నటి, జబర్దస్త్ ఫేమ్ వర్ష పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్‌లో మానియా సెలూన్‌లో ప్రారంభోత్సవంలో సందడి చేశారు. కార్యక్రమంలో మానియా కో ఫౌండర్ ఉదయ్ కుమార్, నిర్వాహకులు శ్రీనివాస్, గౌతమి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. 17 ఫిర్యాదులు



శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో.. డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు



చందానగర్ సర్కిల్ -21లో సమస్యలు తెలుసుకుంటున్న డీసీ శశిరేఖ

చందానగర్: చందానగర్ సర్కిల్- 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 15 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్ శశిరేఖ తెలిపారు. టౌన్ ప్లానింగ్ 8, శానిటేషన్ 1, రెవెన్యూ 02, ఇంజనీరింగ్ 1, ఎంటమాలజీ 1, యూసీడీ 1 ఫిర్యాదులు అందగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణసాయి ఎన్‌క్లేవ్ కాలనీవాసులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి కాలనీలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, కృష్ణచారి, సాయిబాబా, వీరేందర్, బీవీఎన్ ప్రసాద్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, సురేందర్‌రావు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ను కలిసిన కృష్ణసాయి ఎన్‌క్లేవ్ కాలనీ వాసులు

ఘనంగా బీపీ మండల్ జయంతి

ఆల్విన్‌కాలనీ: బీపీ మండల్ జయంతి సందర్భంగా హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో ఉన్నటువంటి ఓబీసీల కోసం మండల కమిషన్ తెచ్చిన ఘనత బీపీ మండల్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావు, జీఆర్ విధాత గుజ్జ రమేష్, బీసీ నాయకుడు యంజాల పద్మయ్య, గంధం నాగేశ్వరరావు, ఆకుల సత్యనారాయణ, కర్ర వెంకటేశ్వర్లు, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గోనె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంగీతం, దేశభక్తి గీతాల పోటీలు

కూకట్‌పల్లి: శ్రీ రామకృష్ణ వివేకానంద సేవా సమితి, మియాపూర్ వారి ఆధ్వర్యంలో 26, 27 తేదీల్లో సాయంత్రం 7 గంటలకు సంగీతం, భక్తి గీతాలు, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాలలోని ఔత్సాహికులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు శ్రీ రామకృష్ణ వివేకానంద సేవా సమితి ధ్యానమందిరం, ప్లాట్ 166, రాధామాధవ్ అపార్టుమెంట్, జంక్షన్ దగ్గర, ప్రగతి ఎన్‌క్లేవ్, మియాపూర్‌లో సంప్రదించాలని కోరారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాయదుర్గం: మట్టి వినాయకులను పూజించాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం మన ధర్మం అని ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మహిళామోర్చా, యువజన మోర్చా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, హుడా అధికారులు సోమవారం కూల్చివేశారు. 100 సర్వేనంబర్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టు నిబంధనలున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రశాంత్‌నగర్ కాలనీ భూమి వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో రెండు షెడ్డులను నిర్మించారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు, హుడా అధికారుల ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో షెడ్లను కూల్చివేశారు. మరలా నిర్మాణాలు చేపడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బీజేపీ నాయకుల వినతి

రాయదుర్గం: ఖాజాగూడలోని పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జన కోనేరు ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గచ్చిబౌలి డివిజన్, బీజేపీ నాయకులు డిప్యూటీ కమిషనర్ ప్రశాంతికి వినతిపత్రాన్ని అందించారు. ఖాజాగూడ పెద్ద చెరువు వద్ద ట్రాఫిక్ సమస్య ఉండదని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డీసీ కలిసిన వారిలో బీజేపీ నాయకులు జితేందర్‌కుమార్, రవీందర్‌రెడ్డి దిలీప, శివకుమార్ పాల్గొన్నారు.

సమాజసేవలో యువత ముందుండాలి

'నిథమ్' డైరెక్టర్ ప్రొఫెసర్ వి వెంకటరమణ

రాయదుర్గం: సమాజసేవలో విద్యార్థులు, యువత ముందుండాలని నిథమ్ డైరెక్టర్ ప్రొ. వెంకటరమణ సూచించారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లోని హాస్పిటాలిటీ బ్లాక్‌లో సోమవారం నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బ్రహ్మకుమారీస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులు తరచూ రక్తదానం చేయాలని, ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బి.కె.సాక్షి మాట్లాడుతూ మానవతాదృక్పథంతో సేవా కార్యక్రమాలను చేసేందుకు స్వచ్ఛందంగా అందరూ ముందుకు రావాలన్నారు. నిథమ్ విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ యాదగిరి, నిమ్స్ డాక్టర్ రఫత్, నిథమ్ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు, నిమ్స్ వైద్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రామాలకు వెళ్లాలి

ప్రొఫెసర్ కంచ ఐలయ్య

రాయదుర్గం: విద్యార్థులు గ్రామాలకు వెళ్ళి జ్ఞానం పంచాలని ప్రొ.కంచ ఐలయ్య సూచించారు. సోమవారం రాత్రి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బిపి మండల్ జయంతి వేడుకలు, శూద్ర రెబెలియన్ గ్రంథంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం అకడమిక్‌గా రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రొ.బంగ్యభూక్యా, వసుమతి యాదవ్, ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్ ప్రసంగించారు.

నచికేత తపోవన్ సందర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 14వ ఎడిషన్‌లో భాగంగా ఇథియోపియా నుంచి వచ్చిన అంతర్జాతీయ ఎలైట్ అథ్లెట్లు మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో ఉన్న నచికేత తపోవన్‌ను సోమవారం సందర్శించారు. నచికేత తపోవన్ చారిటీ వెనుకబడిన, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య, విలువలు నేర్పిస్తోంది. విద్యార్థులు వెల్‌కమ్ స్పీచ్, యోగాతో వారిని అలరించారు. ఎలైట్ రన్నర్లు కులిచి మెసా, త్సేగా హైలీ, గడిస్సా తబెబె, అసెఫా బులియతో పాటు హైదరాబాద్ రన్నర్స్ సొసైటీకి చెందిన విశ్వనాథ్ జోగిని, స్మితా చామ్లింగ్, దివాకర్ హాజరయ్యారు.

యజమానులపై హాస్టల్ నిర్వాహకుల దాడి

గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు

గచ్చిబౌలి: కోర్టు ఆదేశాలతో హాఖాళీ చేయాలని వచ్చిన భవనం యజమానులపై హాస్టల్ నిర్వాహకులు దాడికి తెగబడ్డారు. బాధితుల ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం.. గచ్చిబౌలి ఇందిరానగర్‌లో కోడూరు మాన్షన్‌లో 2016లో 20 ఫ్లాట్లను నెక్సుజెన్ హాస్టల్‌కు అద్దెకు ఇచ్చారు. 2020లో అగ్రిమెంట్ గడువు ముగిసినా ఖాళీ చేయలేదు. దీంతో ఫ్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. కొద్ది నెలల క్రితం కోర్టు ఆదేశాలతో 9 ఫ్లాట్లను ఖాళీ చేయించారు. మిగతా ఆరు ఫ్లాట్లను ఖాళీ చేయాలని కూకట్‌పల్లి కోర్టు ఆదేశించడంతో సోమవారం ఫ్లాట్ల యజమానులు భవనం వద్దకు వెళ్లారు. కోర్టు సిబ్బంది, లాయర్‌తో కలిసి హాస్టల్ ఖాళీ చే యాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల సమయంలో అమర్‌నాథ్ రెడ్డి అనే వ్యక్తి అనుచరులతో వచ్చి కర్రలు, రాడ్లతో దాడికి దిగారు. పిచ్చేశ్వర్‌రావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సునేష్, శ్రీకాంత్, రజినికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు.

వికలాంగుల పెన్షన్లు పెంచండి: మందకృష్ణ మాదిగ

చందానగర్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా వికలాంగుల పెన్షన్లు మాత్రం పెరగడంలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం చందానగర్ మున్సిపల్ కల్యాణ మండపంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు పెన్షన్ డబ్బులు పెంచాలని సెప్టెంబర్ 9న నగరంలో తలపెట్టిన సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వికలాంగులకు పెన్షన్ పెంచుతామన్న హామీని అమలు చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలల గడుస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు.